
# మరోసారి ఆదరించాలి

గద్వాల పట్టణంలోని బీసీ కాలనీలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బండ్ల



- కాంగ్రెసోళ్ల మాటలు ఊసరవెల్లిని తలపిస్తున్నాయి
- పట్టణ ప్రగతితో గద్వాల రూపురేఖలు పూర్తిగా మార్చాం
- వాళ్లను నమ్మితే అరవై ఏండ్లు వెనక్కి..
- భవిష్యత్‌లో మరింత భరోసా కల్పిస్తాం
- అభివృద్ధి కొనసాగాలంటే నడిగడ్డలో బీఆర్ఎస్ జెండా ఎగరాలి
- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, నవంబర్ 25 : గద్వాలలోని కాంగ్రెస్ నాయకుల మాటలు ఊసరవెల్లిని తలపిస్తున్నాయని, వారు నటనలో సావిత్రిని మించిపోయారని గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ఆరోపించారు. శనివారం జిల్లా కేంద్రంలోని 8, 22, 23, 35 వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ కేశవ్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా మున్సిపాలిటీలో అభివృద్ధి అంతగా జరగలేదన్నారు. స్వరాష్ట్రంలో పట్టణ ప్రగతితో గద్వాల మున్సిపాలిటీ రూపురేఖలు పూర్తిగా మార్చామన్నారు. 50ఏండ్లలో జరగని అభివృద్ధి పదేండ్లలో పూర్తి చేశామన్నారు. ఇక్కడి కాంగ్రెస్ అభ్యర్థి నటించడంలో దిట్ట అని, వారి మోసపూరిత మాటలు నమ్మి ఓటేస్తే వేస్తే కర్ణాటకలోని ప్రజల గతే మనకు పడుతుందన్నారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు కొనసాగాలంటే మరోసారి బీఆర్ఎస్‌ను ఆదరించాలని కోరారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు సహకరించాలని కోరారు. అంతకుముందు రామక్క పాటకు ప్రజలతో కలిసి ఎమ్మెల్యే డాన్స్ చేశారు. ప్రచారంలో వైస్‌చైర్మన్ బాబర్, కౌన్సిలర్లు జయమ్మ, నాగరాజు, నాయకులు గోవిందు తదితరులు పాల్గొన్నారు.



గద్వాల పట్టణంలో ఎమ్మెల్యేను హత్తుకుని మద్దతు తెలుపుతున్న వృద్ధుడు



బీసీ కాలనీలో రాములక్క పాటకు డ్యాన్స్ చేస్తున్న కళాకారులు

### మత్స్యకారులకు అండంగా బీఆర్ఎస్

మత్స్యకారులకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా నిలిచిందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. శనివారం కేసీఆర్ కోచింగ్ సెంటర్‌లో నిర్వహించిన మత్స్యకారుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో మత్స్యకారులను విస్మరించారన్నారు. వారిని కేవలం ఓటు బ్యాంకుగానే చూశారని విమర్శించారు. చేపల వేటకు వెళ్లి చెరువులు, కాలువల్లో ఎంతోమంది ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయారన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక కేసీఆర్ మత్స్యకారులను గుర్తించి వారికి బీమా సౌకర్యం కల్పించారన్నారు. వేటకు అవసరమైన వలలు, వాహనాలను ఉచితంగా అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో భారి మెజార్టీతో బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకుడు గడ్డం కృష్ణారెడ్డి, మత్స్యకారుల సంఘం నాయకులు మధు, దౌలన్న, పాండు, జనార్ధన్, రాఘువ, బంగారం, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

### అక్రమాలకు అవకాశం ఇచ్చినట్లే..

గద్వాల అర్బన్, నవంబర్ 25 : మాఫియా చేసే వ్యక్తులకు అవకాశం ఇస్తే అక్రమాలకు అవకాశం ఇచ్చినట్లేనని ఎమ్మెల్యే ఘాటుగా స్పందించారు. ధరూర్ మండలం ఉప్పేరుకు చెందిన 30మంది బీజేపీ నాయకులు శనివారం బీఆర్ఎస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదేళ్ల కాలంలో గద్వాలలో ఎలాంటి మాఫియా లేకుండా అభివృద్ధి చేసుకున్నామన్నారు. నేడు ఆకస్మికంగా కొంతమంది మాఫియా నాయకులు జతకట్టి అభివృద్ధి చేసే పార్టీపై విషం చిమ్ముతున్నారని విమర్శించారు. గతిలేని పార్టీకి మతిలేని నాయకులు తోడై ప్రజలకు మోసపూరిత హామీలు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. వారికి ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం కృష్ణరెడ్డి, హన్మంత్‌రెడ్డి తదితరులున్నారు.



ఎన్నికల సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

# 'పోస్టల్ బ్యాలెట్'ను వినియోగించుకోవాలి

- కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల/ ఎర్రవల్లి చౌరస్తా, నవంబర్ 25 : ఎన్నికల్లో విధులు నిర్వర్తించే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారి, కలెక్టర్ క్రాంతి తెలిపారు. శనివారం గద్వాల ఎంఏఎల్ డిగ్రీ కాలేజీ, ఎర్రవల్లి చౌరస్తాలోని ఏకశిల పాఠశాలలో నిర్వహించిన ఓపీవోల శిక్షణ, పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓట్లు వేయడాన్ని రిటర్నింగ్ అధికారులు అపూర్వ చౌహాన్, చంద్రకళతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గద్వాల నియోజకవర్గానికి సంబంధించి 731మంది, అలంపూర్ నియోజకవర్గానికి సంబంధించి 600మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును ఆదివారం వరకు వినియోగించుకుంటారని తెలిపారు. ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియలో ఓటరు లిస్టులో పేర్లు పరిశీలించడం, రిజిస్టర్‌లో పేరు నమోదు చేయడం, ఇంకు వేయడం, బ్యాలెట్ బాక్స్‌లో బ్యాలెట్ పేపర్ వేయడాన్ని కలెక్టర్ దగ్గరుండి పరిశీలించారు. మాస్టర్ ట్రైనర్‌లతో ఓపీవోలకు పీపీటీ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. పోలింగ్ రోజు ఎన్నికల నియమావళి ప్రకారం సిబ్బంది విధులు నిర్వర్తించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్, ఆర్డీవో చంద్రకళ, అధికారులు సుబ్రమణ్యం, నరేందర్, మంజుల తదితరులున్నారు.



పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న అధికారులు

# అలంపూర్ అభివృద్ధికి కృషి

- ఆగమై ఓటేస్తే జలగల్లా పట్టి పీడిస్తరు..
- ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి
- మ్యానిఫెస్టోలో సబ్బండ వర్గాలకు సమ ప్రాధాన్యం
- అలంపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు



అయిజ : ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కార్యకర్తలు, ప్రజలు

అయిజ, నవంబర్ 25 : సీఎం కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా అలంపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం అయిజ పట్టణంలోని ఎస్సీ కాలనీలో అలంపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడితో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ప్రతిపక్షాలు కల్లబొల్లి కబుర్లు చెప్పి ప్రజలను మోసం చేయడానికి చూస్తున్నారని, ఆగమై ఓటేసే ప్రజలను జలగల్లా పట్టి పీడుస్తారని హెచ్చరించారు. సీఎం కేసీఆర్ పదేండ్లుగా రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా అహర్నిషలు కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కాని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయన్నారు. బీఆర్ఎస్ విడుదల చేసిన మ్యానిఫెస్టోలో కేసీఆర్ భరోసాలో భాగంగా సౌభాగ్యలక్ష్మి పథకంతో పేద మహిళలకు రూ.3వేలు, ఆసరా ఫించన్ రూ.5వేలకు పెంపు, అర్హులైన పేదకుటుంబాలకు రూ.400కే గ్యాస్ సిలిండర్, సన్నబియ్యం, రైతుబంధు రూ.16వేలకు పెంపు, ఆరోగ్య బీమా కవరేజీ రూ.15లక్షలకు పెంచేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అయిజ మండలంలోని పొలాలకు సాగునీరు అందించేందుకు గానూ పెండింగ్ పనులను పూర్తి చేస్తామన్నారు. అయిజ మున్సిపాలిటీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. తనను గెలిపిస్తే అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు కోరారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చరిత్రాత్మకమన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో ప్రతిపక్షాలకు దిమ్మతిరుగుతుందన్నారు. వచ్చే ఐదేళ్లలో అలంపూర్‌ను సస్యశ్యాలమం చేస్తామని పేర్కొన్నారు. ఈనెల 30న జరుగనున్న పోలింగ్‌లో కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అంతకు ముందు బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



అయిజ : మాట్లాడుతున్న ఎమ్మెల్సీ, చిత్రంలో విజయుడు

### సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించాలి

అయిజ రూరల్, నవంబర్ 25 : రాష్టంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను చూసి తనను ఆశీర్వాదించాలని విజయుడు కోరారు. శనివారం తూంకుంట, జడదొడ్డి, గుడిదొడ్డి, వెంకటాపురం గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు వారికి పూలు చల్లుతూ స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీర్ పల్లెలను అన్ని విధాలుగా అభివృద్ధి చేశారని చెప్పారు. దేశంలోని ఏ రాష్ట్రంలో ప్రవేశపెట్టని సంక్షేమ పథకాలను తెలంగాణలో అమ చేశారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు అధికారదాహంతో కల్లబొల్లి మాటలు చెబు తూ మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, వారితో జాగ్రత్తగా ఉం డాలని సూచించారు. ప్రచారంలో మాజీ ఎంపీపీ సుందర్‌రాజు, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు రాముడు, బీఆర్ఎస్ నాయకులు హనుమంతురెడ్డి, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# 'కాంగ్రెస్'ను నమ్మి ఆగంకావొద్దు

- కేసీఆర్‌ను మరోసారి గెలిపించండి
- కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను ప్రజలు నమ్మొద్దు
- జేడీఎస్ పార్టీ రాయిచూర్ జిల్లా అధ్యక్షుడు విరూపాక్ష

గద్వాల రూరల్, నవంబర్ 25 : కర్ణాటక ప్రజలు కాంగ్రెస్‌కు అధికారమిచ్చి ఆగమయ్యారని, తెలంగాణ ప్రజలు అలా కావొద్దని జేడీఎస్ పార్టీ రాయిచూర్ జిల్లా అధ్యక్షుడు విరూపాక్ష అన్నారు. గద్వాల జిల్లా కేంద్రంలోని జీవీకే ఫంక్షన్‌హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఇచ్చిన 5 గ్యారెంటీలు అమలు కావడంలేదన్నారు. ఆ రాష్ట్ర ప్రజలను మోసం చేసిన సిద్ధరామయ్య సర్కారు దివాలా దిశగా నడుస్తుందని ఆరోపించారు. ఇప్పటివరకు ఒక్క పథకం కూడా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని ధ్వజమెత్తారు. సాగుకోసం నాణ్యమైన కరెంటిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు నిండా ముంచిందని మండిపడ్డారు. కోతల కరెంటుతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ 24 గంటల కరెంటిస్తూ రైతుబంధు, రైతుబీమా పథకాలతో రైతులను ఆదుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు అద్భుతంగా ఉన్నాయని కితాబిచ్చారు. రాష్ట్ర ప్రజలు ఈసారి బీఆర్ఎస్ పార్టీకే పట్టం కట్టాలని కోరారు. సమావేశంలో కార్యక్రమంలో జేడీఎస్ పార్టీ రాయిచూర్ జిల్లా సభ్యులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విరూపాక్ష